సాక్షి
ప్రకాశం

మంగళవారం, 4, ఫిబ్రవరి, 2025



ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి
ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించారు. - 8లో..



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి
జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పామూరు మండలం గోపాలపురం, కొండపి మండలం పెరిదేపి వద్ద ఈ ప్రమాదాలు జరిగాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/20

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఖబరస్తాన్‌కు కేటాయించిన స్థలాన్ని ముస్లింలకే అప్పగించాలి

- సీపీఐ జిల్లా సమితి డిమాండ్

ఒంగోలు సిటీ: గత ప్రభుత్వ హయాంలో ముస్లింలకు కేటాయించిన ఖబరస్తాన్ స్థలాన్ని ముస్లింలకే కేటాయించాలని సీపీఐ జిల్లా సమితి సోమవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ ముస్లింల ఖబరస్తాన్ కోసం దశరాజుపల్లి రోడ్డులో గత ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. అందులో భాగంగా ఒంగోలు నగర మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా తీర్మానం చేశారన్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆ స్థలాన్ని ముస్లింలకు దక్కకుండా కమ్మ సామాజిక వర్గానికి పార్కుగా రూపొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఒంగోలు నగరంలో 35 వేల మందికి పైగా ముస్లింలు నివసిస్తున్నారని, వారికి కొత్తపట్నం రోడ్‌లో ఫ్లెటైవర్ కింద ఇచ్చిన రెండు ఎకరాల స్థలం ఖబరస్తాన్‌కు సరిపోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దామచర్ల స్పందించి ముస్లింలకు కేటాయించిన రెండు ఎకరాల ఖబరస్తాన్ స్థలాన్ని వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

వాటర్ షెడ్ యాత్ర స్థల పరిశీలన



వాటర్ షెడ్ యాత్ర ప్రారంభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీసీపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలుపరచనున్న వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీన ప్రారంభించనున్నామని అడిషనల్ పీడీ వండర్‌మాన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మురుగుమ్మి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లె గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రమంత్రి వర్చువల్‌గా జంగాలపల్లెలో వాటర్ షెడ్ పథకాన్ని ప్రారంభించనున్నారు. పథక ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, కలెక్టర్, కనిగిరి ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభిస్తారన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభాకర్ శర్మ ఉన్నారు.

38వ జాతీయ క్రీడల జ్యూరీ అప్పీల్ కమిటీ సభ్యునిగా నాగేశ్వరరావు




ఒంగోలు: 38వ జాతీయ క్రీడల జ్యూరీ అప్పీల్ కమిటీ సభ్యునిగా వి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు ఫెన్సింగ్ క్రీడా విభాగానికి జ్యూరీ అప్పీల్ కమిటీ సభ్యునిగా ఈయన వ్యవహరించనున్నారు. ఈ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలు ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానిలోని గౌలపర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఒంగోలు నివాసి, ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు అయిన నాగేశ్వరరావు 2002లో మన రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ క్రీడలకు, 2022 గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయ క్రీడలకు, 2023లో గోవాలో జరిగిన జాతీయ క్రీడలలోను తన సేవలు అందించారు. తాజాగా 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉత్తరాఖండ్‌లో జరగనున్న ఫెన్సింగ్ జాతీయ క్రీడలకు జ్యూరీ అప్పీల్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. వీటితోపాటు నాగేశ్వరరావు ప్రస్తుతం ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర కమిటీ సభ్యునిగా, ఖేలో ఇండియా సౌత్ ఇండియా జోన్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కమిటీ సభ్యునిగా , తమిళనాడు ఫెన్సింగ్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ సభ్యునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్, వివిధ జిల్లాల ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి సదరమ్ సర్టిఫికెట్ల పునఃపరిశీలన

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో మంగళవారం నుంచి సదరమ్ సర్టిఫికెట్ల పునఃపరిశీలన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ బాలాజీ నాయక్, మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. లోకోమోటివ్, ఈఎన్‌టీ, మానసిక రుగ్మతలు, కళ్లకు సంబంధించిన విభాగాల్లో రిమ్స్‌లో పునఃపరిశీలన జరుగుతుందని తెలిపారు. ఈఎన్‌టీలో 4926, లోకోమోటివ్ 6040, మానసిక విభాగం 5486 మందికి పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. లోకోమోటివ్ విభాగానికి సంబంధించి మంగళవారం, బుధవారం, గురువారాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో రూము నంబర్ 4లో, ఈఎన్‌టీకి సంబంధించి మంగళ, బుధ, గురువారాల్లో రూమ్ నెంబర్ 213లో, కంటి విభాగానికి సంబంధించి మంగళ, బుధ, గురువారాల్లో రూము నెంబర్ 124, మానసిక విభాగానికి సంబంధించి సోమవారం నుంచి శనివారం వరకు రూము నంబర్ 5లో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కండువాలు మారితే కాసుల వర్షమే!

అధికార కూటమి పార్టీలు ఒంగోలు కార్పొరేషన్‌ను సంతగా మార్చేశాయి. సంతలో బేరమాడినట్లు కార్పొరేటర్లను కొనుగోలు చేసేందుకు ఆయా పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. అదీ నగరాభివృద్ధి కోసం వచ్చిన నిధులతో ఈ తంతు సాగిస్తున్నట్టు సమాచారం. దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్లు అభివృద్ధి నిధులను కాజేసేందుకు పార్టీ మార్పిళ్లకు తెరదీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిన్న మొన్నటిదాకా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను అవినీతి జలగలంటూ దుమ్మెత్తిపోసి ఇప్పుడు పార్టీలో చేర్చుకునేందుకు నాయకులు పోటీలు పడుతుండడంపై టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నట్టు సమాచారం.



- ఒంగోలు నగరపాలక సంస్థలోని కార్పొరేటర్ల కొనుగోలుకు కూటమి పార్టీలు యత్నం
- అభివృద్ధి నిధులతో టీడీపీ ఎర
- రూ.20 కోట్ల పనులకు టెండర్లు వేయక ముందే కమీషన్లు ఫిక్స్
- సైకిల్ ఎక్కితే బోలెడన్ని లాభాలు ఉంటాయంటున్న దామచర్ల
- కొనుగోలు చేసిన కార్పొరేటర్లను జనసేనలో చేర్పించేందుకు బాలినేని యత్నం
- ఒంగోలు కార్పొరేషన్‌లో పట్టు కోసం టీడీపీ, జనసేన పోటాపోటీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఒంగోలు నగర పాలక సంస్థ ఏర్పడిన తరువాత 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మొత్తం 50 స్థానాలకు గాను 41 వైఎస్సార్ సీపీ గెలుచుకోగా ఇద్దరు ఇండిపెండెంట్లు వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో వారి బలం 43కు చేరింది. టీడీపీ కేవలం 6 స్థానాలు గెలవగా, జనసేన ఒక స్థానం సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే గత సార్వత్రిక ఎన్నికలకు ముందే దామచర్ల జనార్దన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కొనుగోళ్లు ప్రారంభించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల తరువాత కూడా ఆయన అదే తీరు కొనసాగించారు. టీడీపీ నాయకులకు ఒక్కమాట కూడా చెప్పకుండా నగర మేయర్ గంగాడ సుజాతతో సహా 18 మంది కార్పొరేటర్లకు పచ్చ కండువా కప్పారు. దామచర్ల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ శ్రేణులు ధర్నాలు చేశారు. ఇక మిగిలిన కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ లోనే కొనసాగుతున్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి 'గ్లాసు' పార్టీలో చేరినప్పటికీ ఆయనతో ఒకరిద్దరు మాత్రమే వెళ్లారు.

ప్రభుత్వ నిధులతో కార్పొరేట్లకు గాలం:
ఇటీవల నగర అభివృద్ధి కోసం నిధులు విడుదలయ్యాయి. ఇందులో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్ క్యాప్) నిధుల కింద రూ.3.5 కోట్లు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా)కు రూ.14 కోట్లతో పాటుగా పాత గ్రాంట్ తాలుకు మరో రూ.3 కోట్ల నిధులు రానున్నాయి. ఇందులో వుడాకు ఇప్పటికే రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ఈ మొత్తం కలుపుకొని మొత్తం రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ఇక్కడే అసలు కథ మొదలైంది. ఎమ్మెల్యే దామచర్ల సలహాతో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మేయర్ అంతరంగ కార్పొరేటర్‌గా చక్రం తిప్పుతున్న శాండిల్య కలిసి కార్పొరేటర్ల తాయిలాలకు సంబంధించి ఒక పథకం రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగా ఎక్సస్ రేట్లకు టెండర్లను పిలవడం ద్వారా కమీషన్లు దండుకోవాలని ప్లాన్ రూపొందించినట్లు తెలుస్తుంది. ఈ నిధులతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ఎర వేసి వారిని తమ పార్టీ లోకి చేర్చుకోవాలని వ్యూహం సిద్ధం చేశారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే దామచర్ల కనుసన్నల్లోనే ఈ బేరసారాలకు తెరదీసినట్లు వినిపిస్తుంది.

టెండర్ల కంటే ముందు కమీషన్లు ఖరారు..
రూ.20 కోట్ల నిధులతో చేపట్టే పనులకు ఇంకా టెండర్లు పిలవలేదు. కానీ కమీషన్ రేట్లు మాత్రం ఖరారు చేసినట్లు సమాచారం. రూ.20 కోట్ల నిధుల్లో మేయర్‌కు, మిగిలిన టీడీపీ కార్పొరేటర్లకు కమీషన్ ఇచ్చే అంగీకారం జరిగిందని తెలుస్తోంది. పచ్చ కండువా కప్పుకుంటే వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు కూడా అదే ప్యాకేజీ ఇస్తామని బేరాలు చేస్తున్నట్లు వినికిడి. నిన్నా మొన్నటిదాకా భూములు కాజేశారని మేయర్ మీద, అవినీతికి పాల్పడుతున్నారని కార్పొరేటర్ల మీద విమర్శలు చేసిన ఎమ్మెల్యే దామచర్ల ఇప్పుడు వారికి ప్రభుత్వ నిధులను దోచిపెడుతున్నారని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నారు.

ఉనికి కాపాడుకునేందుకు బాలినేని యత్నం
ఇదిలా ఉండగా జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి కూడా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో మంతనాలు మొదలుపెట్టి కొంతమేర సఫలం అయినట్లు సమాచారం. కూటమి ఒప్పందం ప్రకారం రూ.20 కోట్లలో జనసేనకు రావాల్సిన వాటా ఉందని బాలినేని వర్గం వాదిస్తోంది. ఇప్పటికే 18 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సైకిలెక్కి తిరుగుతుండగా మిగిలిన వారిలో చాలా మంది వైఎస్సార్‌సీపీ జెండా వీడేది లేదని స్పష్టం చేశారు. మెజార్టీ కార్పొరేటర్లను ఎలాగోలా జనసేనలో చేర్చుకోవడానికి రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ నిధులతో పార్టీ మార్పిళ్లా...
ప్రభుత్వ నిధులతో పార్టీ మార్పిళ్లకు పాల్పడుతున్న కూటమి నాయకుల తీరుపై జిల్లాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. శివారు ప్రాంతాల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రాంట్లు జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన నాయకులు ఇలా ప్రజల సొమ్ముతో కార్పొరేటర్లకు పందేరం చేయడం పట్ల నగర ప్రజలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే భాగ్యనగర్ 4వ లైన్ సీసీ రోడ్డు నిర్మాణం పనులను నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే పీఏ రికమండ్ చేసిన సొంత సామాజిక వర్గానికి చెందిన కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. నగర సుందరీకరణ పేరుతో డివైడర్లకు రంగులు వేసి బినామీకి రూ.40 లక్షలు అంటగట్టినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.20 కోట్ల గ్రాంట్ ను కార్పొరేటర్లను కొనుగోలు చేసేందుకు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

సైబర్ వల విల..



'మీ ఆధార్ నంబరుతో మోసాలు జరిగాయి మీపై కేసు నమోదైంది.. మేం చెప్పినంత ఇస్తే ఏం కాకుండా చూస్తాం'..'మీకు సంబంధించిన వీడియోలు మా వద్ద ఉన్నాయి..అడిగినంత ఇవ్వకపోతే నెట్‌లో పెడతాం'..'మేము ఏసీబీ నుంచి ఫోన్ చేస్తున్నాం.. డబ్బు ఇవ్వకపోతే కేసు నమోదు చేస్తాం..' అంటూ రకరకాలుగా సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులే లక్ష్యంగా సాగుతున్న ఈ సైబర్ మోసాలకు గురై రూ.లక్షలు పోగొట్టుకున్న ఘటనలు కనిగిరి ప్రాంతంలో నానాటికీ పెరిగిపోతున్నాయి.

- కనిగిరిపై సైబర్ వల..
- డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లే అధికం
- బాధితులు అత్యధికంగా విద్యావంతులే..
- ఓ విశ్రాంత ఉద్యోగి నుంచి రూ.35 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- మోసగాళ్ల వలలో చిక్కి రూ.లక్షలు పోగొట్టుకున్న మరి కొందరు టీచర్లు
- ఆలస్యంగా వెలుగు చూస్తున్న ఘటనలు

కనిగిరిరూరల్: టెక్నాలజీ వినియోగం విస్తృతమవుతున్న కొద్దీ సైబర్ నేరాలూ పెరుగుతున్నాయి. ఓ వైపు పోలీస్ అధికారులు సెల్‌ఫోన్ మెసేజ్‌లు, ఫ్లెక్సీలు, ప్రచార హోర్డింగ్‌లు, పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృతంగా సైబర్ మోసాలపై ప్రచారం చేస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నా.. నియోజకవర్గంలో ఎక్కడో చోట సైబర్ నేరగాళ్ల వలలో ఎవరో ఒకరు చిక్కుకుని లక్షలు పోగొట్టుకుని.. ఆ తర్వాత తేరుకుని లబోదిబోమంటున్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడుతున్న వారు ఇటీవల కనిగిరిలో పెరుగుతున్నారు.

■ తాజాగా పట్టణంలో ఓ విశ్రాంత ఎంఈఓ రూ.35 లక్షలు సైబర్ మోసగాళ్ల బారిన పడి మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. సైబర్ నేరగాళ్లు తెలివిగా ఆ విశ్రాంత ఎంఈఓకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. విశ్రాంత ఎంఈఓ భార్య అంగన్‌వాడీ ఉద్యోగి అని, ఇద్దరు కుమారులు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారని వారి ఆధార్ కార్డు నంబర్లు, ఫోన్ డేటాలతో సహా సైబర్ నేరగాళ్లు ఆయనకు చెప్పి.. మీ కుటుంబీకులపై, మీపై కేసులు నమోదవుతున్నాయని, తాము ఏసీబీ అధికారులమని ఫోన్ ద్వారా బెదిరింపు కాల్ చేసినట్లు సమాచారం. దీంతో భయపడిన ఆయన తన దగ్గర ఉన్న కొంత నగదు.. అప్పుగా మరి కొందరి దగ్గర కొంత నగదు తీసుకుని 5 దఫాలుగా పలు బ్యాంక్ అకౌంట్లకు సుమారు రూ.35 లక్షల వరకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సమాచారం. అందుకు గాను ఆ ఉద్యోగి తన కుమారుల వద్ద కూడా కొంత నగదు అడగటంతో.. అనుమానం వచ్చిన పెద్ద కుమారుడు బెంగళూరు నుంచి ఇంటికి వచ్చి విచారించి.. అది సైబర్ మోసంగా గుర్తించారు. సైబర్ మోసగాళ్లతో ఆ విశ్రాంత ఉద్యోగి కుమారుడు.. ఫోన్‌లో గట్టిగా మాట్లాడి, ప్రశ్నించి వార్నింగ్ ఇవ్వడంతో మోసగాళ్లు మిన్నకుండిపోయారు.




కనిగిరిలో పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్

■ అలాగే ఇటీవల ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడిని కూడా సైబర్ మోసగాళ్లు బెదిరించారు. ఇతర రాష్ట్రాల్లో ఉపాధ్యాయుడి ఆధార్ కార్డుపై పలు నేరాలు జరిగాయని, సుమారు రూ.2.50 కోట్లు బ్యాంకులకు మోసం చేశారంటూ మీ పై మా రాష్ట్రంలో కేసు నమోదు చేసినట్లు బెదిరించారు. ముందు వాట్సప్ కాల్‌తో లైన్‌లోకి వచ్చి ఆగంతకులు ఒక్క సారిగా వీడియో కాల్‌లోకి మారి.. ఉపాధ్యాయుడ్ని బెదిరించారు. ఫోన్‌తో ఇంట్లోనే ఉండాలని కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ సుమారు 2.30 గంటల సేపు అతని గదిలో నుంచి కదలనీయకుండా చేసి తీవ్ర ఇబ్బందులు పెట్టారు. చివరకు పోలీస్ యూనిఫాంతో ఉన్న ఓ వ్యక్తి లైన్‌లోకి వచ్చి .."మీరు మంచి వారిలాగ ఉన్నారు.. మేమూ ఉద్యోగలమే.. అర్జంట్‌గా కొంత నగదు మేము చెప్పిన అకౌంట్‌లోకి వేయండి..నేను మిమ్మల్ని సేవ్ చేస్తానంటూ'' చెప్పటంతో తన అకౌంట్‌లో రూ.57 వేలు ఆ టీచర్ ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ తర్వాత తేరుకుని అతని సహ ఉపాధ్యాయులతో చర్చించి అది సైబర్ మోసగాళ్ల పని అని గుర్తించి సైబర్ క్రైం నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. అయితే వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ అంతా పూర్తిగా ఇంగ్లిష్‌లో కావడం కొసమెరుపు. అలాగే పట్టణానికి చెందిన ఇద్దరు టీచర్లకు తాము ఏసీబీ, ఇతర పోలీస్ శాఖల అధికారులమని చెప్పి ఫోన్ చేసి హిందీలో మాట్లాడటంతో వారు వెంటనే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలపడంతో ఫోన్ కట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గతేడాది కనిగిరిలో ఎంపీడీఓగా పని చేసి, ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగిగా ఉన్న అధికారిని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము ఏసీబీ నుంచి అంటూ బెదిరించారు. తొలి విడతగా కొంత నగదు చెల్లించిన ఆ అధికారి రెండో దఫాలో అప్రమత్తం కావడంతో సైబర్ నేరగాళ్లు మిన్నకుండిపోయారు. ఇటీవల పీసీపల్లి మండల ఎంపీడీఓకు కూడా తాము విలేకర్లమని, నగదు ఇవ్వాలని సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గతంలో ఇలా...
ఏడాది క్రితం మార్ఫింగ్ వీడియోలతో పట్టణంలోని పలువురు ప్రముఖ వ్యక్తులను, వ్యాపారులను, ప్రజా ప్రతినిధులను వీడియో కాల్‌లు చేసి.. ఆ తర్వాత మార్ఫింగ్ వీడియోలు పెట్టి బెదిరింపులకు గురి చేసిన సంఘటనలు ఉన్నాయి. కొందరు వారి ఉచ్చులో పడి రూ.లక్షలు మోసపోయారు. డబ్బులు ఇవ్వక పోతే వీడియో నెట్‌లో పెడతామని.. వైరల్ చేస్తామని చెప్పి.. వారిని బెదిరించి.. సైబర్ మోసగాళ్లు నగదు వసూలు చేశారు. కొందరు వెంటనే తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసి, వారి సలహాల మేరకు సిమ్ కార్డ్‌లను తీసేయడంతో ప్రశాంతంగా ఉన్నారు. ఇలా సైబర్ నేరగాళ్లు రకరకాలుగా మోసాలు చేస్తున్నారు.

ఉద్యోగులే టార్గెట్‌గా..!
ఇటీవల కనిగిరిలో జరిగిన సైబర్ మోసాలు (డిజిటల్ అరెస్ట్ స్కామ్) చూస్తే ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులే లక్ష్యంగా జరుగుతున్నాయి. ఆయా శాఖల ఉద్యోగులకు జీతాలు లేదా... పింఛన్ నగదు అకౌంట్లలో జమైన తర్వాతే సైబర్ నేరగాళ్ల వారికి టార్గెట్ చేసి నగదు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇఫ్‌రత్ తారాకు పింఛన్ ఇచ్చేందుకు చర్యలు



ఎస్‌హ్యాన్స్ పత్రం




మంచంలో ఉన్న ఎస్‌కే ఇఫ్‌రత్ తారా

- బెడ్‌రిడెన్ పేషంట్‌కు రూ.15 వేలు పింఛన్ ఇచ్చేందుకు సిఫార్సు చేసిన వైద్యాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కనిగిరిరూరల్: మంచంలో ఉన్నా సర్కారు పింఛన్ కోతకు గురైన దివ్యాంగురాలు ఇఫ్‌రత్ తారా దీన గాథపై 'సాక్షి'లో సోమవారం 'మంచానికి పరిమితమైనా.. మనసు రాలేదా..' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సచివాలయ, వైద్య శాఖ అధికారులు స్పందించారు. వార్డు సచివాలయ వెల్ఫేర్ అధికారి మధు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది బాధిత దివ్యాంగురాలికి ఇంటికి వెళ్లి పరిశీలించి సమగ్ర నివేదికను జిల్లా వైద్య శాఖ కార్యాలయానికి పంపారు. డీసీహెచ్‌ఎస్ ఎస్ సూరిబాబు ఆదేశాల మేరకు బెబ్‌రిడెన్ అయిన ఇఫ్‌రత్ తారా అమ్మమ్మ ఖాజాబీని ఆస్పత్రికి పంపించి తగు ధ్రువీకరణ పత్రాలు తయారు చేశారు. రూ.15 వేల పింఛన్‌కు సిఫార్సు చేస్తూ పింఛన్ వెర్షన్ మార్చుతూ వైద్యశాఖకు సిఫార్సు చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిని ఎస్‌హ్యాన్స్ లెటర్‌తో ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు మంగళవారం ఒంగోలుకు వచ్చి ఇఫ్‌రత్ తారాకు సంబంధించిన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని డీసీహెచ్‌ఎస్ ఎస్ సూరిబాబు ఫోన్‌లో బాలిక అమ్మమ్మ ఖాజాబికి సూచించారు. అలాగే డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన 'సాక్షి'తో మాట్లాడుతూ గతంలో కిడ్నీ పేషంట్ కింద ఇఫ్‌రత్ తారాకు రూ.10 వేల పింఛన్ వచ్చేదని.. ఆ పాప పూర్తి దివ్యాంగురాలు (బెడ్‌రిడన్) అయినందున.. పింఛన్ వెర్షన్ మార్చి రూ.15 వేల పింఛన్‌కు ప్రభుత్వానికి (ఎస్‌హ్యాన్స్ లెటర్) నివేదిక పంపిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో ఇఫ్‌రత్ తారాకు బెడ్‌రిడెన్ పింఛన్ రూ.15 వేల పింఛన్ మంజూరవుతుందన్నారు.

పోక్సో కోర్టు ప్రత్యేక పీపీగా శ్రీనివాసరావు



ఒంగోలు: పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అడ్వొకేట్ గొట్టిపాటి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1998లో అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2009 నుంచి 2014 వరకు అద్దంకిలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించారు. తాజాగా ఒంగోలులోని పోక్సో కోర్టులో బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టపరిధిలో కేసుల విచారణ వేగవంతం అయ్యేందుకు తన వంతు బాధ్యత నిర్వహిస్తానని పేర్కొన్నారు.

ఉపాధి పనిదినాలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకంలో లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో వ్యవసాయ పనుల వల్ల కూలీలు రావడం లేదంటూ ఉపాధి పనిదినాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఫారం పాండ్స్, ఫిష్‌పాండ్స్ వంటి వ్యవసాయ అనుబంధ ఉపాధి పనులపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వచ్చే వారం గోకులం షెడ్డుల నిర్మాణ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయన్నారు. ఎంబుక్ వంటి పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ నుంచి రుణాల కోసం ఏడో తేదీ లోపు దరఖాస్తులు పెట్టేలా సచివాలయ స్థాయిలో అర్హులకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్‌లో పెండింగ్ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలకు సంబంధించి వచ్చిన డబ్బును సకాలంలో జమ చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంతో పాటు మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు, ఇంటి పన్నులపై దృష్టి సారించాలన్నారు. దీనిలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీపీఓ వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, పరిశ్రమల జీఎం శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ నులి పురుగుల మాత్రలు
ఒంగోలు అర్బన్: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ద్వారా జిల్లాలోని చిన్నారులందరికీ ఆల్‌బెండజోల్ టాబ్లెట్లు తప్పనిసరిగా అందజేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగుల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని పిల్లలందరికీ నులిపురుగుల టాబ్లెట్‌లు అందజేయాలన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, వైద్యులు భగీరధి, సూరిబాబు, డీసీహెచ్‌ఎస్ హేమంత్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రీతమ్, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.



మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

క్లుప్తంగా

మిత్రులు కాదు కాలయముళ్లు

- కాలువలో నెట్టి యువకుడిని చంపిన స్నేహితులు
- మద్యం మత్తులో ఘాతుకం

యర్రగొండపాలెం: రోజూ కలిసిమెలసి ఉండే మిత్రులే ఆ యువకుడి పాలిట కాలయముళ్లుగా మారారు. మద్యం మత్తు తలకెక్కడంతో స్నేహితుడి ప్రాణాలు హరించే ఘాతుకానికి ఒడిగట్టారు. త్రిపురాంతకం సమీపంలోని నాగార్జున సాగర్ కాలువ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. యర్రగొండపాలెం మండలంలోని అయ్యంబొట్లపల్లి గ్రామానికి చెందిన బొమ్మనబోయిన పెద్దసాంబయ్య(30), కురిచేటి అంజి, తోకల చిన్న లక్ష్మయ్య మరో యువకుడితో కలిసి మద్యం సేవించేందుకు సాగర్ కాలువ వద్దకు చేరారు. అక్కడ పుటుగా మద్యం తాగారు. అదే సమయంలో పెద్దసాంబయ్యతో మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. సాంబయ్యను ఒక్కసారిగా కాలువలోకి నెట్టడంతో నీట మునిగి మరణించాడు. విషయం తెలుసుకున్న త్రిపురాంతకం పోలీసులు సోమవారం ఉదయం మృతదేహాన్ని కాలువలో నుంచి వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



కానిస్టేబుల్ భౌతికకాయానికి గన్ సెల్యూట్ చేస్తున్న పోలీసులు

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ అంత్యక్రియలు సోమవారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. కొమరోలు మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన సింగంశెట్టి బాల ఉగ్ర(35) కారులో వెళ్తూ దొనకొండ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. సాయుధ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు. దొనకొండ పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి నివాళులర్పించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



మర్రిపూడి: పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బ్యారన్ దగ్ధమైన సంఘటన మర్రిపూడి మండలంలోని సన్నమూరులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలో పోలా పెద బ్రహ్మయ్యకు చెందిన బ్యారన్‌లో సుమారు 1200 పొగాకు కర్రలు క్యూరింగ్ చేస్తున్నారు. పచ్చాకు కర్ర మొద్దుగొట్టంపై పడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి బ్యారన్ పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న నేరెళ్ల ఏడుకొండలు, సురేష్‌కు చెందిన మరో బ్యారన్‌కు మంటలు వ్యాపించి పాక్షికంగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా మంటలు అదుపు చేసేందుకు గ్రామస్తులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

ప్రజా సమస్యలపై శ్రద్ధ వహించాలి

- సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి
- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మీ కోసం గ్రీవెన్స్‌లో ప్రజలు తెలిపిన సమస్యలు పరిష్కరించడంపై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో సోమవారం మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి ఆ విషయాన్ని వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారధి, వరకుమార్, విజయజ్యోతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యల్లో కొన్ని...

➤ యానాది సంఘాల మహాకూటమి నాయకులు చలంచర్ల ప్రసాద్, రాపూరి శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎస్టీలకు కూడా గిరిజన జనాభా కుల గణన జరిపి ఎస్టీ వర్గీకరణ ఏర్పాటు చేసి 14 లక్షల మంది యానాదుల జీవితాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరారు. నేటికీ తినేందుకు తిండి కూడా లేని పరిస్థితుల్లో అత్యధిక శాతం యానాదులు ఉన్నారని తెలిపారు. వారందరికీ న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

➤ తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం హైస్కూల్లో మధ్యాహ్న భోజనం వండే గోనుగుంట పద్మ గ్రీవెన్స్ అధికారులను కలిసి తనకు న్యాయం చేయాలని కోరింది. తనను అక్రమంగా పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓలు విధుల నుంచి తొలగించారని ఫిర్యాదు చేసింది. భర్త లేడని, తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, కేవలం మధ్యాహ్న భోజనం వంట చేసి జీవిస్తున్న తనను తొలగించడంతో కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేసింది. పరిశీలించి తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేసింది.

➤ మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రామానికి చెందిన సాధినేని సాంబశివరావు, సర్వేపల్లి అనిల్‌కుమార్, నీలం వెంకట్రావు గ్రీవెన్స్‌లో అధికారులను కలిశారు. తమ గ్రామంలోని గాంధీబొమ్మ వద్ద నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, నిలుపుదల చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. పంచాయతీ అధికారులకు తెలిపినా అవినీతికి పాల్పడి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

➤ కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన పారాలీగల్ వలంటీర్ సింగమనేని ఆంజనేయులు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి చింతల గ్రామంలోని సర్వే నంబర్ 429లో ఉన్న మాచాలమ్మకుంట మంచినీటి చెరువును కాపాడాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఈ చెరువు తాగునీటికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే, కొంతమంది రైతులు ఎరువులు, పురుగు మందులతో కలుషితం చేస్తున్నారని చెప్పారు. దీంతో చెరువులో నీరు కలుషితమై ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోందన్నారు. పరిశీలించి చెరువును సురక్షితంగా ఉంచాలని కోరారు.

చీరతో ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య



వసంత మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చౌడయ్య

యర్రగొండపాలెం: చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వేకువజామున యర్రగొండపాలెంలో జరిగింది. స్థానిక గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాలకు వెళ్లే దారిలో టిఫిన్ సెంటర్ నడుపుతున్న కుందారపు వసంతలక్ష్మి(51) ఆదివారం రాత్రి అందరితో కలిసి తన గృహంలో నిద్రపోయింది. వేకువజామున లేచి మొదటి అంతస్తులోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతిచెందిందని బంధువులు తెలిపారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడటంతో పాటు మానసికంగా ఆందోళన చెందుతోందని తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై పి.చౌడయ్య వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- బాధితులకు న్యాయం చేయాలి
- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఒంగోలు సిటీ:

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రిసెప్షన్, లాకప్ రూమ్, ప్రాపర్టీ/స్టోర్ రూమ్, రికార్డు రూమ్‌లను తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్ ఇండెక్స్, కేసు డైరీలు, రిజిస్టర్లు, పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నేరాలు, శాంతిభద్రతల పరిస్థితి, నమోదైన కేసుల వివరాలు తెలుసుకుని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, పురోగతి గురించి సీఐని అడిగి తెలుసుకున్నారు. విచారణ దశలో ఉన్న గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసులు, దీర్ఘకాలంగా కేసులు పెండింగ్‌లో ఉండేందుకు గల కారణాలపై సమీక్షించారు. క్వాలిటీ ఆఫ్ ఇన్వస్టిగేషన్‌తో కేసుల్లో విచారణను వేగవంతం చేయడానికి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసులు ఛేదించాలని, ఒక నిర్దిష్ట ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో గస్తీ పెంచి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఐజీ ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో పటిష్ట బీట్ సిస్టం ఏర్పాటు చేయాలని సూచించారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటిని అరికట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటూ డ్రంక్ డ్రైవ్ టెస్టులు చేపట్టాలని, తీర ప్రాంతాల్లో పటిష్ట గస్తీ ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతల సమస్యలు చోటుచేసుకోకుండా కచ్చితమైన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి పెట్టి అరికట్టాలన్నారు. పాత నేరస్తులు, రిపీటెడ్ అఫెండర్స్‌పై నిఘా ఉంచాలని, పెట్టీ కేసులు నమోదు చేయాలని, రోడ్డు సేఫ్టీ నియమాలు, సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా ఇచ్చేలా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఐజీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్, ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సీఐ సుబ్బారావు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

రవాణా రంగ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

- ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

ఒంగోలు సిటీ: రవాణా రంగం సేవలను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రవాణా రంగ సేవలన్నింటినీ ప్రైవేటుపరం చేయాలని జీవోలు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవోలను అన్ని జిల్లాల్లో, రాష్ట్రాల్లో అమలు చేసేందుకు కసరత్తు చేయడం జరుగుతోందన్నారు. ఈ ప్రైవేటీకరణ సేవలను ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. సేవలు ప్రైవేటుపరం కావడం వల్ల మొత్తం ఫీజులు పెరిగే అవకాశం ఉందన్నారు. దీని వల్ల రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల జీవన పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. డిసెంబరులో పార్లమెంట్ సమావేశాల సందర్భంగా బీఎన్ఎస్ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. బీఎన్ఎస్ చట్టం అమలైతే రూ.10 లక్షల జరిమానా కట్టాలని, 10 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాలని అన్నారు. మోటార్ వెహికల్ చట్టం-2019ని కూడా సవరించాలని డిమాండ్ చేశారు. దీని ఫలితంగా అన్ని రాష్ట్రాల్లో లైసెన్స్ ఫీజులు, జరిమానాలు పెరుగుతున్నాయన్నారు. వీటి భారం కోట్ల రూపాయల్లో కార్మికులపై పడుతోందన్నారు. కార్మికులకు కేరళ తరహా సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, కానీ, ఫలితం లేదని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 24న చలో పార్లమెంట్ కార్యక్రమం తీసుకున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పర్మినెంట్ స్టాండ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు, అధికారులు జులుం తగ్గించాలన్నారు. ప్రతి కార్మికుడికి కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ బేగ్, హుస్సేన్, రాజేష్, హరి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన తెలంగాణ ఎడ్లు



గౌతవరంలో బండ లాగుతున్న ఎడ్ల జత

రాచర్ల: రాచర్ల మండలంలోని గౌతవరం గ్రామంలో పోలేరమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆరు పళ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో మొత్తం 10 జతల ఎడ్లు పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన ఎం.అక్షరారెడ్డి ఎడ్ల జత నిర్ణీత 20 నిమిషాల్లో 5089 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన వెంకట కృష్ణయ్య ఎడ్ల జత 4,769 అడుగులు లాగి రెండో బహుమతి, బేస్తవారిపేట మండలం ఖాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసూరారెడ్డి ఎడ్ల జత 4000 అడుగులు లాగి తృతీయ బహుమతి, రాచర్ల మండలం అకవీడు గ్రామానికి చెందిన ఉలాపు లింగసాయినాయుడు ఎడ్ల జత 3750 అడుగులు లాగి నాలుగో బహుమతి, గిద్దలూరు మండలం అక్కల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన దక్షితరెడ్డి ఎడ్ల జత 3750 అడుగులు లాగి ఐదో బహుమతి సాధించాయి. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను గ్రామ పెద్దల చేతులు మీదుగా పంపిణీ చేశారు.

రేపు జిల్లా స్థాయి సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక

సంతనూతలపాడు: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 5వ తేదీ జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏవీ రమణారెడ్డి, ఏ సుందరరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు రావాలని కోరారు. ఎంపికైన సీనియర్ మహిళల జట్టు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికలకు వచ్చే వారు 1-1-1996 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తిరుమలశెట్టి రవికుమార్ (96660 67764)ను సంప్రదించాలని కోరారు.

టైర్ పేలి చెట్టును ఢీకొన్న కారు

- నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు


పొదిలి: వేగంగా వస్తున్న కారు టైరు పేలి చెట్టును ఢీకొన్న సంఘటనలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం సోమవారం స్థానిక దర్శి రోడ్డులోని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. బ్లూకోల్ట్స్ పోలీసులు రామకృష్ణ, వెంకటరామిరెడ్డి కథనం మేరకు.. విజయవాడకు చెందిన నాసరయ్య, యోగేశ్వరి, మనోజ్ మరో ఇద్దరు పిల్లలు కడపలో మృతి చెందిన బంధువును చూసేందుకు కారులో వెళ్తున్నారు. కారును శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి నడుపుతున్నాడు. స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి టైర్ పేలడంతో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న ముగ్గురు పెద్దవారితో పాటు, ఒక చిన్నారికి గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ వద్ద బెలూన్‌లు ఓపెన్ కావటంతో అతను సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సంఘటన స్థలంలో అశోక్ మృతదేహం

పామూరు/కొండపి: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో సంభవించిన రెండు ప్రమాదాల్లో ఓ యువకుడు, మరో వృద్ధుడు మృత్యువాతపడ్డారు. పామూరు మండలంలోని గోపాలపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం బూసిగూడెం గ్రామానికి చెందిన కూసు అశోక్, బుడమాల విష్ణు పామూరు మండలంలోని గోపాలపురం వద్ద ఇటుక బట్టీల్లో పని చేసేందుకు రెండు రోజుల క్రితం వచ్చారు. ఆదివారం రాత్రి ఇద్దరు బైక్‌పై పామూరు వచ్చి తినుబండారాలు, ఇతర వస్తువులు తీసుకుని ఇటుక బట్టీల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం గండిపాలేనికి వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ వెనుక సీటులో కూర్చున్న కూసు అశోక్(21) రోడ్డు ఎగిరిపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై టి.కిషోర్‌బాబు పరిశీలించారు. బైక్ నడుపుతున్న విష్ణుకు మోస్తారు గాయాలుకాగా, అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు.



మృతి చెందిన మాలకొండయ్య

- పొలానికి వెళ్లి ఇంటికి వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ సంఘటన కొండపి మండలంలోని పెరిదేపి శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన మంచాల మాలకొండయ్య(60) పొగతోటలో సేద్యం చేసుకుంటూ పెరిదేపి గ్రామంలో నివసిస్తున్నాడు. మిట్టపాలెం గ్రామానికి చెందిన ధర్నాసి శివ బైక్‌పై వెళ్తూ మాలకొండయ్యను ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. తీవ్రంగా గాయపడిన మాలకొండయ్య ఒంగోలు జీజీహెచ్‌లో మృతి చెందారు. ధర్నాసి శివకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మినీ లారీ ఢీకొని రెండు గేదెలు మృతి

- మరో 4 గేదెలకు గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన గేదె

పామూరు: నిమ్మకాయ బస్తాల లోడ్‌తో వెళ్తున్న మినీ లారీ ఢీకొని రెండు గేదెలు మృత్యువాతపడగా, మరో నాలుగు గేదెలు గాయాలపాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి పామూరు డంపింగ్ యార్డ్ సమీపంలో 565 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. నిమ్మకాయ బస్తాలతో పామూరు నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న మినీలారీకి ఒక్కసారిగా గేదెలు అడ్డు రావడంతో వేగం అదుపు కాక ఢీకొట్టింది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే చనిపోగా, మరో 4 గేదెలు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయాయి. పశువులను రాత్రి వేళ వదిలేయవద్దని పోలీసులు తరచూ చెబుతున్నా పెడచెవిన పెట్టడంతోనే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల కాలంలో పలువురు ద్విచక్ర వాహనదారులు కూడా చీకట్లో పశువులను ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యారు.